క్లుప్తంగా

ప్రకృతిని శాసించడం అసాధ్యం



ఇరుసుమండలో వేద సభ నిర్వహిస్తున్న పండితులు

అంబాజీపేట: సృష్టిలో ప్రకృతిని శాసించడం ఎవరివల్లా కాదని, వేదాధ్యయనం, పఠనం ద్వారా దానిని అదుపు చేయవచ్చని శ్రీపాద మాణిక్య అవధాని, ఆకెళ్ల నరసింహ సోమయాజులు అన్నారు. ఇరుసుమండలో ఆకెళ్ల శ్రీవేంకట సత్యనారాయణ సిద్ధాంతి స్వగృహంలో మంగళవారం వేద సభ జరిగింది. ఈ సందర్భంగా సభకు ముఖ్య అతిథులుగా హాజరైన శ్రీపాద మాణిక్య అవధాని, ఆకెళ్ల నరసింహ సోమయాజులు మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి, సంప్రదాయలు, నేటి వైజ్ఞానిక ఆవిష్కరణలు, ఏనాడో వేదాల్లో నిక్షిప్తమై ఉన్నాయన్నారు. జపాన్, జర్మనీల్లో భారతీయ వేదాలను వారి భాషల్లోకి తర్జుమా చేసుకుని, పరిశోధనలు చేస్తున్నారన్నారు. అనంతరం సిద్ధాంతి సత్యనారాయణమూర్తి, తన తల్లి అనంతలక్ష్మితో కలిసి వేద పండితులను సత్కరించారు. వివిధ ప్రాంతాలకు చెందిన వేద పండితులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొత్తపేట: మోడేకుర్రు పంచాయతీ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అమలాపురం ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. 11 కేవీ లైన్ ఆర్డీఎస్ఎస్ పనుల కోసం మోడేకుర్రు, గొలకోటివారిపాలెం గ్రామాలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు.

51 కేజీల లడ్డూ వితరణ



సంధిపూడిలో భారీ లడ్డూను ఆలయ కమిటీ వారికి ఇస్తున్న సత్తిబాబు

ఆలమూరు: మండలంలోని సంధిపూడిలో ఉన్న శ్రీవిజయ గణపతి ఆలయ ఆవరణలో నెలకొల్పిన మండపానికి గ్రామానికి చెందిన భక్తుడు నల్లా సత్తిబాబు 51 కేజీల లడ్డూను ఆలయానికి సమర్పించారు. ఈ లడ్డూను ఆయన ఆలయ కమిటీ సభ్యులకు మంగళవారం అందజేశారు. గణపతి నవరాత్రి మహోత్సవాల ముగింపు అనంతరం ఈ లడ్డూను వేలం వేసి, తద్వారా వచ్చే సొమ్మును ఆలయ అభివృద్ధికి వినియోగిస్తామని కమిటీ ప్రతినిధులు చెప్పారు. గణనాథుడికి అత్యంత ప్రీతిపాత్రమైన లడ్డూను వితరణ చేసిన భక్తుడు సత్తిబాబును గ్రామస్తులు అభినందించారు.

ఘనంగా సామూహిక సీమంతాలు



మూలస్థాన అగ్రహారంలో సీమంతాలు చేస్తున్న ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

ఆలమూరు: పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మూలస్థాన అగ్రహారంలో మంగళవారం సామూహిక సీమంతాలు జరిగాయి. గ్రామ అంగన్‌వాడీ కార్యకర్తల సమాఖ్య ఆధ్వర్యంలో 18 మంది గర్భిణులకు శాస్త్రోక్తంగా సీమంతాలు చేశారు. పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, నూతన వస్త్రాలు అందజేశారు. పరిసర ప్రాంతాల మహిళలు పాల్గొని గర్భిణులకు అక్షింతలు వేసి, పండంటి బిడ్డకు జన్మనివ్వాలని దీవించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, గర్భిణులకు, చిన్నారులకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సర్పంచ్ లంక వరప్రసాదరావు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యుల నిరసన

రాజోలు: పీహెచ్‌సీల్లో సేవలందిస్తున్న వైద్యులకు జీఓ 85 తీవ్ర నష్టం కలిగిస్తుందని మంగళవారం తాటిపాక పీహెచ్‌సీ వైద్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రాథమిక వైద్యశాల ఆస్పత్రి వైద్యుల సంఘం పిలుపు మేరకు దశలవారీగా నిరసన వ్యక్తం చేస్తున్నామని డాక్టర్ సీహెచ్ ఫణికిరణ్ తెలిపారు. జీఓ ద్వారా వైద్యులకు మూడేళ్ల సర్వీసు నిర్వీర్యం అవుతుందన్నారు. జీఓ ద్వారా పీజీ అవకాశాలు తగ్గించడం దారుణమన్నారు. వైద్య సేవలకు అంతరాయం లేకుండా, ఈ నెల 12 వరకు నిరసన చేపడతామన్నారు. ఈ నెల 13, 14వ తేదీల్లో అత్యవసర సేవలు మినహా, మిగిలిన ఇతర విధులను పూర్తిగా బహిష్కరిస్తామన్నారు. 15న చలో విజయవాడ ర్యాలీ, 16న నిరవధిక నిరాహార దీక్షకు రాష్ట్ర యూనియన్ పిలుపునిచ్చిందన్నారు.

పేకాట శిబిరంపై దాడి

సఖినేటిపల్లి: టేకిశెట్టిపాలెంలో మంగళవారం పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. దాడిలో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.10,600 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై కె.దుర్గా శ్రీనివాస రావు తెలిపారు.

గురువే.. సర్కారుకు బరువు..!

- రాజోలు దీవిలో విద్యా వ్యవస్థకు నిర్లక్ష్యపు చీడ
- కళాశాలల్లో వేధిస్తున్న అధ్యాపకుల కొరత
- కాంట్రాక్టు అధ్యాపకులే గతి
- రామేశ్వరం, బట్టేలంకల్లో ఉపాధ్యాయులతో బోధన
- అగమ్యగోచరంగా విద్యార్థుల భవితవ్యం



కేశనపల్లి కళాశాల ప్రాంగణం

మలికిపురం: రాజోలు దీవిలో విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం మూడు జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేసింది. ఈ ఏడాది పూర్తి స్థాయిలో అధ్యాపకులను ప్రభుత్వం నియమిస్తుందని ఆయా కళాశాలల పరిధిలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భావించారు. అయితే దీనిని ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదు. ఫలితంగా అనేక మంది విద్యార్థులు ఈ ఏడాది కళాశాలలో చేరేందుకు విముఖత చూపారు. చేరిన విద్యార్థులపై ప్రభుత్వం శ్రద్ధ చూపించిందా అంటే.. అదీ లేదు. ఈ ఏడాది ప్రభుత్వ నిర్వాకంతో కళాశాలలో చేరిన విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది.

గ్రామస్తుల ప్రత్యేక శ్రద్ధ

మలికిపురం మండలం కేశనపల్లి, బట్టేలంక, సఖినేటిపల్లి మండలం రామేశ్వరం ఉన్నత పాఠశాలల ప్రాంగణంలో ఈ జూనియర్ కళాశాలలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కేశనపల్లి కళాశాలలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం 20 మంది ద్వితీయ సంవత్సరం 27 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి నలుగురు గెస్ట్ అధ్యాపకులు మాత్రమే ఉన్నారు. రెగ్యులర్ అధ్యాపకుల నియామకం ఇంకా జరగలేదు. పరిసర గ్రామస్తులు శ్రద్ధతో విద్యార్థులను చేరుస్తున్నారు. ఫీజులు కూడా గ్రామస్తులు విరాళాలు వేసి మరీ చెల్లిస్తున్నారు. యూనిఫాం కూడా గ్రామస్తుతే సమకూరుస్తున్నారు. ప్రభుత్వం మాత్రం అధ్యాపకులను సైతం నియమించడం లేదు.

అధ్యాపకుల కొరత ఇలా..

బట్టేలంకలో కూడా దాదాపు 35 మంది విద్యార్థులు ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉన్నారు. ఇక్కడా అధ్యాపకుల కొరత ఉంది. ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులే ఇక్కడ కళాశాల విద్యార్థులకు బోధన సాగిస్తున్నారు. రామేశ్వరం కళాశాల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఇక్కడ ఈ ఏడాది ప్రథమ సంవత్సరంలో 20 మంది విద్యార్థులు చేరారు. ఒక్క అధ్యాపకుడిని కూడా నియమించ లేదు. ఇక్కడ మొత్తం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులే కాలేజీ విద్యార్థులకు బోధన చేస్తున్నారు. ఇక ఈ కళాశాలలో ప్రత్యేక గదులు కూడా లేవు. పాఠశాల గదుల్లోనే బోధన సాగుతోంది.

ఇక్కడ కళాశాలలు కీలకం

ఆయా కళాశాలలు రాజోలు దీవి ప్రాంత పేదలకు ఎంతో అవసరం. పేదలు అత్యధికంగా ఉండే ఈ ప్రాంతంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రెండు కళాశాలలను ఏర్పాటు చేయగా, ఒక కళాశాల 2019కి ముందే ప్రభుత్వం మంజూరు చేసింది. మొత్తం 53 గ్రామాలు, అత్యధిక తీర ప్రాంతం కలిగి ఉన్న రాజోలు దీవిలో మత్స్యకార, బీసీ సామాజిక వర్గాలు అధికంగా ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో ఈ కళాశాలలను నాటి జగన్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గతేడాది వరకూ ఇక్కడ సబ్జెక్టు బోధనలకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ ఏడాది వచ్చేసరికి అధ్యాపకుల కొరత ఏర్పడింది. గత అధ్యాపకులు బదిలీపై వెళ్లినా, ఆ పోస్టులను ఈ ఏడాది కూడా భర్తీ చేయలేదు. ఫలితంగా కొత్త విద్యార్థులు చేరేందుకు విముఖత చూపుతున్నారు.

అగమ్యగోచరంగా..

ఆయా కళాశాలల్లో పూర్తి స్థాయిలో అధ్యాపకులను నియమించి, మౌలిక వసతులు కల్పించి ఉంటే.. పేద ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఆ లక్ష్యంతోనే గత ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసినా, ఈ ఏడాది అధ్యాపకుల కొరత, మౌలిక వసతుల లేమి వెరసి ఇప్పటికే ఉన్న విద్యార్థుల భవిష్యత్తును అగమ్యగోచరంగా మార్చేస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని, ఆయా కళాశాలల్లో బోధన, మౌలిక వసతులను పూర్తి స్థాయిలో కల్పించాలని ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.

తక్షణ చర్యలు తీసుకోవాలి



తీర ప్రాంతాల పేదల కోసం గత ప్రభుత్వం మూడు కళాశాలలను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఆయా కళాశాలల్లో అధ్యాపకులు సైతం లేరు. ఇలాగైతే ఎలా? వెంటనే అధ్యాపకుల కొరతను తీర్చాలి. ఇప్పటికే చేరిన విద్యార్థుల భవిష్యత్తుపై శ్రద్ధ వహించి, తక్షణ చర్యలు తీసుకోవాలి. మౌలిక వసతులను కూడా కల్పించాలి.

– రాపాక వరప్రసాదరావు, మాజీ ఎమ్మెల్యే, రాజోలు

కళాశాలలపై శ్రద్ధ వహిస్తాం




కేశనపల్లి, బట్టేలంక, రామేశ్వరం కళాశాలలపై శ్రద్ధ వహిస్తాం. వాటిలో అధ్యాపకుల కొరత, మౌలిక సదుపాయాల కల్పనపై విద్యా శాఖ అధికారులతో మాట్లాడి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– దేవ వరప్రసాద్, ఎమ్మెల్యే, రాజోలు

ముమ్మాటికీ మానవ తప్పిదమే..

విజయవాడ వరదపై జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు



మామిడికుదురు: విజయవాడలో వరద ముంపు ముమ్మాటికీ మానవ తప్పిదమేనని, ప్రభుత్వ వైఫల్యం వల్లే లక్షలాది మంది తీవ్రంగా నష్టపోయారని జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన మంగళవారం 'సాక్షి'తో మాట్లాడారు. సుదీర్ఘ చరిత్ర ఉన్న కృష్ణా నదికి ఎంత మేర వరద వస్తుంది, భారీ స్థాయిలో వరదలు వచ్చే సందర్భంలో తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళిక ఉందన్నారు. కానీ కూటమి ప్రభుత్వం ఆ ప్రణాళికను అమలు చేయకుండా తీవ్ర నిర్లక్ష్యం వహించిందన్నారు. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నేడు లక్షలాది మంది ఉపాధి కోల్పోయి అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరద బాధితులను ఆదుకోవడంలో కూడా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందని విమర్శించారు. తెలంగాణలో వరద బాధితులను ఆదుకునేందుకు పక్కా ప్రణాళికతో అక్కడి ప్రభుత్వం ముందుకు వెళ్తుండగా, మన రాష్ట్రంలో మాత్రం ఏ విధమైన ప్రకటన లేకుండా కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వానికి ప్రచారంపై ఉన్న శ్రద్ధ, వరద బాధితులను ఆదుకోవడంలో మాత్రం లేదన్నారు. కేవలం వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌ను విమర్శించమే లక్ష్యంగా పెట్టుకున్నారు మినహా, బాధితులకు పునరావాసం, ఉపాధి కల్పించడంపై ఎక్కడా శ్రద్ధ చూపడం లేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రాజకీయాలు విడనాడి వరద బాధితులకు అండగా నిలిచి, వారికి భరోసా కల్పించాలని జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు సూచించారు.

వరద గోదావరితో కలవరం

- లంక వాసుల్లో గుబులు
- అధికారులు అప్రమత్తం



పాశర్లపూడి వైనతేయ వారధి వద్ద గోదావరి నది పరవళ్లు



ముక్తేశ్వరం వృద్ధ గౌతమి పాయలో వరద ఉధృతికి మునిగిన పాత వంతెన



ఆలమూరులోని రెండు వంతెనల మధ్య గౌతమీ గోదావరి ఉధృతి



పి.గన్నవరం మండలం శివాయలంకలో ప్రజలతో మాట్లాడుతున్న ఆర్డీఓ సత్యనారాయణ

మామిడికుదురు: గోదావరి వరద మళ్లీ తీర గ్రామాల ప్రజలను కలవరపెడుతోంది. మూడు రోజుల క్రితం తగ్గిన వరద.. మళ్లీ పోటెత్తడంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోదావరి వరద రెండో ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరుకుంటుందన్న సమాచారం లంక గ్రామాల వాసుల్లో గుబులు పుట్టిస్తోంది. వరద నేపథ్యంలో పాశర్లపూడి బ్రిడ్జి వద్ద నదీ ప్రవాహం పరవళ్లు తొక్కుతోంది. అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి స్నానఘట్టం వద్ద గరుత్మంతుడి విగ్రహాన్ని వరద నీరు చుట్టుముట్టింది. అప్పనపల్లి కాజ్‌వేకు రెండు వైపులా వరద నీరు చేరింది. కాజ్‌వే ముంపు బారిన పడిన పక్షంలో అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉంది. పెదపట్నంతో పాటు, పాశర్లపూడి, పాశర్లపూడిలంక గ్రామాల్లోని మత్స్యకార ప్రాంతాలు సైతం ముంపు బారిన పడవచ్చంటున్నారు.

నిలకడగా గోదారమ్మ పరవళ్లు

ఆలమూరు: గౌతమీ గోదావరి నది వారం రోజుల నుంచి ఉధృతంగా ప్రవహిస్తోంది. నదీ గర్భంలోని బడుగువానిలంక చుట్టూ ఉన్న పాయల్లో వరద నీరు వచ్చి చేరుతోంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద వరద నీరు 10 నుంచి 12 అడుగులకు మధ్యే ఉండటంతో, దానికనుగుణంగా ఇరిగేషన్ శాఖ బ్యారేజీ వద్ద ఉన్న 175 గేట్ల ద్వారా లక్షలాది క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదిలిపెడుతున్నారు. దీంతో వరద నీరు పరవళ్లు తొక్కుతోంది. వరద ప్రభావానికి జొన్నాడ పుష్కర ఘాట్ మునిగి, నీరు ఆలయాలకు చేరింది. వరద ఉధృతి పెరుగుతుండటంతో లంక గ్రామాల ప్రజలు అప్రమత్తమయ్యారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీసు యంత్రాంగం వరద తీవ్రతపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ఏటిగట్టు వెంబడి పహారా కాస్తున్నారు. బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో, లంక గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు.

ముక్తేశ్వరం–అయినవిల్లి లంక కాజ్‌వే మునక

అయినవిల్లి: గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తుండంతో ముక్తేశ్వరం–అయినవిల్లిలంక ఎదురుబిడెం వద్ద కాజ్‌వే మంగళవారం రాత్రి మునిగింది. ఈ కాజ్‌వేపై మోకాళ్ల లోతు నీరు ప్రవహిస్తోంది. దీంతో వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక, కపిలేశ్వరపురం మండలంలోని అద్దంకివారిలంక గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాల్లోని ప్రజలు ఈ కాజ్‌వేపై నుంచే అయినవిల్లి మండల కేంద్రమైన ముక్తేశ్వరం సెంటర్‌కు చేరుకోవాలి. అలాగే జిల్లా కేంద్రమైన అమలాపురం చేరుకోవడానికి ఇదే మార్గం. అలాగే ముక్తేశ్వరం వృద్ధ గౌతమి నది పాయలో వరద ఉధృతి ఎక్కువగా ఉంది. వృద్ధ గౌతమి శ్మశాన వాటిక వరద నీటిలో ఉంది. దీంతో శ్మశాన వాటికకు దహన సంస్కారాలకు వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు.

వేగంగా పెరుగుతున్న గోదావరి

పి.గన్నవరం: భద్రాచలం వద్ద అత్యంత వేగంగా వరద పెరుగుతుండటంతో కోనసీమలోని వశిష్ఠ, వైనతేయ, గౌతమీ నదీపాయలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ ఏడాది గోదావరికి నాలుగోసారి మళ్లీ వరద రావడంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చాకలిపాలెం శివారులో ఉన్న పశ్చిమగోదావరి జిల్లా కనకాయలంక కాజ్‌వే మళ్లీ వరద నీట మునిగింది. దీంతో మోకాలిలోతు వరదనీట్లో ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు గత 50 రోజులుగా పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. జిల్లా సరిహద్దులో ఉన్న అయోధ్యలంక, పెదమల్లంక, సిర్రావారిలంక, ఆనగర్లంక ప్రజలు పడవలపైనే వెళ్తున్నారు. లంకల్లోని పశువులు నేటికీ ఏటిగట్లపైనే ఉన్నాయి. వ్యవసాయ ఉత్పత్తులను తరలించేందుకు లంక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ఆర్డీఓ పర్యటన

వశిష్ఠ, వైనతేయ నదీపాయల్లో వరద ఉధృతి మళ్లీ పెరుగుతున్న నేపథ్యంలో లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తపేట ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ అన్నారు. మానేపల్లి శివారు శివాయలంకలో మంగళవారం పి.గన్నవరం తహసీల్దార్ శ్రీపల్లవితో కలిసి ఆర్డీఓ పర్యటించారు. శివాయలంక ప్రజలతో ఆయన మాట్లాడారు. వరద సమయంలో చేపట్టాల్సిన సహాయక చర్యలపై చర్చించారు. శివాయలంకకు బోట్లు సిద్ధం చేసినట్టు తెలిపారు. అనంతరం బూరుగులంక రేవును ఆయన పరిశీలించారు.

సురక్షిత ప్రాంతాలకు గర్భిణులను తరలించండి

- కలెక్టర్ మహేష్ కుమార్
- అప్పనపల్లి కాజ్‌వే పరిశీలన



అప్పనపల్లి కాజ్‌వే వద్ద వరద పరిస్థితిని పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

మామిడికుదురు: గోదావరి వరదల నేపథ్యంలో లంక గ్రామాల్లో ఉన్న గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ముంపు గ్రామాల ప్రజలకు అవసరమైన తాగునీరు, ఇతర సదుపాయాల కల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన ఆర్డీఓ కేశవ్ వర్ధన్‌రెడ్డితో చర్చించారు. పాశర్లపూడి కరకట్ట దిగువన ఉన్న అప్పనపల్లి కాజ్‌వేను మంగళవారం కలెక్టర్ పరిశీలించారు. గోదావరి వరద పెరుగుతున్న నేపథ్యంలో కాజ్‌వే ముంపు బారిన పడుతుందని ఆర్డీఓ కలెక్టర్‌కు తెలిపారు. దీనివల్ల అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాలకు రోడ్డు సౌకర్యం ఉండదన్నారు. మూడు గ్రామాలకు చెందిన బాధితుల కోసం తీసుకోవాల్సిన చర్యలపై ఆర్డీఓకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. తాగునీరు అందించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రాబోయే రెండు, మూడు రోజులు తీర గ్రామాలకు చెందిన అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అప్పనపల్లి కాజ్‌వేపై రాకపోకలను నిలిపి వేయాలని ఆదేశించారు. ఏ విధమైన ప్రమాదాలు జరగకుండా. ముందస్తుగా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ మృత్యుంజయ రావు, జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, అప్పనపల్లి సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మి, మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, గెద్దం వెంకటేశ్వరరావు ఉన్నారు.

ప్రాణం విలువ తెలుసుకోండి



రాజోలు సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సాయిబాబు



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీసుధ

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిబాబు

రాజోలు: ప్రాణం విలువ తెలిస్తే ఆత్మహత్యలు చేసుకోవాలనే ఆలోచన దూరమవుతుందని రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిబాబు అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణా దినాన్ని పురస్కరించుకుని మంగళవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ సాయిబాబు మాట్లాడుతూ, చిన్న కారణాలతో క్షణికావేశానికి లోనై అనేక మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఒత్తిడిని దూరం చేసుకుని, మానసిక ప్రశాంతతకు, యోగా, ధ్యానం వంటి ప్రక్రియలను అలవర్చుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ టీఎస్‌వీ పద్మనాభం, అధ్యాపకులు శైలజ, అశ్విని, ఎన్ఎస్ఎస్ పీఓ నల్లి రాజు, సరిత తదితరులు పాల్గొన్నారు.

విజయాన్ని అందుకోవాలంటే..

మలికిపురం: కష్టాలు, అపజయాల వంటివి జీవితంలో ఎదురవుతుంటాయని, వీటిని ఎదుర్కొంటేనే విజయాలను అందుకోగలరని ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పీవీవీ వరప్రసాద్ అన్నారు. స్థానిక దీప్తి మహిళా కళాశాలలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం జరిగింది. ప్రిన్సిపాల్ శ్రీసుధ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మన చేతుల్లోనే జీవితం ఉందని, మంచి ఆలోచనలతో ఆనందకరమైన జీవితాన్ని ఆస్వాదించాలని చెప్పారు. సామాజిక కార్యకర్త తాడి సహదేవ్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి వారి తల్లిదండ్రుల కష్టాన్ని తెలుసుకుని ప్రవర్తించాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. సంస్థ జిల్లా అధ్యక్షుడు ఎన్.రమేష్‌బాబు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన అల్లూరి నాటకం

మలికిపురం: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు నాటక ప్రదర్శన మలికిపురంలో జరిగింది. రావూరి సూరన్న కళానాట్య మండలి ఆధ్వర్యంలో లక్కవరం గ్రామానికి చెందిన గన్నపురెడ్డి నరసింహారావు (రావూరి సూరన్న మనవడు) అల్లూరి సీతారామరాజు పాత్రను పోషించారు. ప్రముఖ పాత్రధారులుగా రామరాజు లంక గ్రామానికి చెందిన సీసీఎఫ్ సొసైటీ అధ్యక్షుడు నల్లి బాలకృష్ణ, లక్కవరం గ్రామానికి చెందిన ఆచంట కృష్ణ నటించారు.

దాహార్తితో విద్యార్థుల విలవిల

నిరుపయోగంగా ప్యూరిఫై వాటర్ ఫిల్టర్



తొండవరం జెడ్పీ హైస్కూల్‌లో నిరుపయోగంగా ఉన్న వాటర్ ఫిల్టర్

అంబాజీపేట: తొండవరం జెడ్పీ హైస్కూల్‌లో తాగునీరు లేక విద్యార్థులు దప్పికతో అలమటిస్తున్నారు. నాడు నేడు పథకంలో భాగంగా 2020లో మంజూరు చేసిన ప్యూరిఫై వాటర్ ఫిల్టర్ గత ఎనిమిది నెలలుగా నిరుపయోగంగా ఉందని స్థానికులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఈ వాటర్ ఫిల్టర్‌కు మంచినీటి ట్యాంకు నుంచి సరఫరా చేయకుండా, కేవలం బోరు వాటర్‌ను సరఫరా చేయడంతో తరచూ మరమ్మతులకు గురవుతోంది. నందంపూడి మంచి నీటి ట్యాంకు పైపులైన్ జెడ్పీ హైస్కూల్‌కు సమీపంలో ఉన్నా, దానిని అమర్చడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. విద్యార్థుల తాగునీటి అవసరాలకు స్థానికులు ప్రతి రోజు 5 వాటర్ టిన్లను దాతలు పంపిణీ చేస్తున్నారని ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు, పీఎంసీ చైర్మన్ పేరాబత్తుల వెంకటసుబ్బారావు, నేదునూరి మురళీకృష్ణ బుధవారం తెలిపారు. వాటర్ ఫిల్టర్‌కు మరమ్మతులు చేయిస్తే వినియోగంలోకి వస్తుందని, దీని పార్టులు దొరక్కపోవడంతో టెక్నీషియన్ రావడం లేదని ఉపాధ్యాయులు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థుల దాహార్తిని తీర్చాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.

మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం

సీఐ రుద్రరాజు భీమరాజు



అంబాజీపేట: నియోజకవర్గ పరిధిలో మాదక ద్రవ్యాల నేరాలపై ఉక్కుపాదం మోపుతామని పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజు అన్నారు. అంబాజీపేట పోలీస్ స్టేషన్‌లో పి.గన్నవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలను ఆయన మంగళవారం స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక సీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, ఇటీవల కాలంలో మాదక ద్రవ్యాల వినియోగం ఎక్కువైనట్టు తెలిసిందన్నారు. యువత మాదకద్రవ్యాలకు బానిసలుగా మారుతూ, భవిష్యత్తును నాశనం చేసు కుంటున్నారన్నారు. మాదక ద్రవ్యాలను విక్రయించే, వినియోగించే వారిపై నిరంతర నిఘా ఉంచుతామన్నారు. మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులకు పాల్పడే వారిపై నూతన చట్టాల ఆధారంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అంబాజీపేట సెంటర్లో సాయంత్రం వేళ ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని, సమస్య పరిష్కారానికి అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇలాఉండగా ఈయన మారేడుమిల్లి సీఐగా పనిచేస్తూ బదిలీపై అంబాజీపేట వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ సీఐగా ఉన్న డి.ప్రశాంత్‌కుమార్ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ కార్యాలయంలో రిపోర్ట్ చేశారు.

విఘ్నేశ్వరునికి సీఐ పూజలు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారిని పి.గన్నవరం సీఐ భీమరాజు మంగళవారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. సీఐగా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా ఆయన తొలిసారి అయినవిల్లి విఘ్నేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

వైభవంగా గణేశ్ విగ్రహం ఊరేగింపు



పెదపట్నంలంకలో ఊరేగిస్తున్న గణేశ్ విగ్రహం

మామిడికుదురు: గణపతి నవరాత్రుల్లో భాగంగా పెదపట్నంలంక దుర్గా సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహానికి మంగళవారం ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. తీన్‌మార్ నృత్యాలు, బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ ఊరేగింపు ఉత్సాహంగా కొనసాగింది. గణేశ్ విగ్రహాన్ని ఊరేగింపుగా బి.దొడ్డవరం తీసుకువెళ్లి, అక్కడ వైనతేయ గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. ముందుగా స్వామివారి లడ్డూను వేలం వేశారు. 18 కిలోల లడ్డూను ఏడిద వీరభద్రరావు రూ.26 వేలకు, 12 కిలోల లడ్డూను పేకేటి రామకృష్ణ రూ.17,200కు దక్కించుకున్నారు.

జాతీయ కవితా పోటీల్లో సుబ్బారావు ప్రతిభ



వులుసు వీవీఎస్ సుబ్బారావు

కొత్తపేట: 'తెలుగుజాతి కీర్తి శిఖరం ఎన్టీఆర్' అనే శీర్షికపై జాతీయ కవితా పోటీల్లో కొత్తపేటకు చెందిన డాక్టర్ వులుసు వీవీఎస్ సుబ్బారావు టాప్ టెన్ విజేతగా నిలిచారు. సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక జాతీయ స్థాయిలో కవితా పోటీలు నిర్వహించినట్టు మంగళవారం ఆయన విలేకరులకు తెలిపారు. వృత్తి రీత్యా ప్రైవేట్ కళాశాల అధ్యాపకుడైన సుబ్బారావు, కవిగా, రచయితగా గుర్తింపు పొందారు. కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమాదేవి ప్రశంసా పత్రాన్ని పంపినట్టు సుబ్బారావు తెలిపారు.

అభివృద్ధి కార్యాచరణకు అధికారుల పర్యటన



అంతర్వేది బీచ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

సఖినేటిపల్లి: అంతర్వేది పుణ్యక్షేత్రంలో పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా అభివృద్ధి పనుల కార్యాచరణ రూపకల్పనకు మంగళవారం అధికారులు ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. రాజోలు ఎమ్మెల్యే ఆదేశాలపై ఏపీ అర్బన్ చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, ఏపీ అర్బన్ డివిజన్ ఆఫీసర్ సిద్ధార్ధ అంతర్వేదిని సందర్శించారు. ప్రభుత్వ పరంగా ఆయా రంగాల్లో ఏ అభివృద్ధి పనులు, ఏ ప్రాంతాల్లో చేపడితే భక్తులకు, టూరిస్టులకు అనువుగా ఉంటాయో అన్న అంశాలపై వారు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేశారు. వీరి వెంట దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ ఎం.సత్యకిరణ్, ఎంపీటీసీ బైరా నాగరాజు, పలువురు నాయకులు ఉన్నారు.